www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 23 మే 2023

పులివెందులలో అత్యధిక వర్షపాతం

ప్రజాశక్తి-కడప

పులివెందులలో అత్యధికంగా 76.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉదయం నుండి సోమవారం ఉదయం 8 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కడపలో 2.2, చెన్నూరులో 24.4, సిద్ధవటం లో 2.0, బద్వేల్ లో 5.6, బి.మఠంలో 9.6, శ్రీ కాశినాయన మండలంలో 16.4, కలసపాడులో 20.6, పోరుమామిళ్ల 4.0, బి. కోడూరు 9.2, గోపవరం 4.6, ఎస్ మైదుకూరు 6.2, కొండాపురం 4.2, ప్రొద్దుటూరు 6.6, ముద్దనూరు 5.4, జాపాడు 0.2, దువ్వూరు 4.2, ఎర్రగుంట్ల 1.8, లింగాల 5.2, వేముల 19.0, తొండూరు 9.6, వియన్ పల్లి 1.4, వేంపల్లి 2.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లావ్యాప్తంగా సగటున 6.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

అసైన్డ్ పందేరంపై గరంగరం

పండ్లతోటల పరిహారంపై వాగ్వాదం
పారదర్శకంగా అసైన్‌మెంట్ కమిటీలు : ఇన్‌ఛార్జి మంత్రి
ఆక్రమణలు పెచ్చుమీరిన గ్రామాల్లో స్పెషల్‌డ్రైవ్ : కలెక్టర్
పులివెందుల పాఠశాలల్లో మౌలిక వసతులపై నిలదీత
అన్నమయ్య నిర్వాసితులను ఆదుకోవాలి: ఎమ్మెల్సీ

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అసైన్డ్ భూముల పందేరంపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గరంగరంగా నడిచింది. జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అధ్యక్షతన సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు ముగిసింది. ఉమ్మడి జిల్లాలోని 10 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల్లో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీలు సి.రామచంద్రయ్య, పి.రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, రామగోపాల్‌రెడ్డి మినహా మిగిలిన ఎమ్మెల్యేలు, ఎంపీలు గైర్హాజరు కావడం గమనార్హం. జిల్లా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల ప్రస్తావన మొక్కుబడిగానే సాగిందని చెప్పుకోవచ్చు.

జిల్లాకు వ్యవసాయమే ప్రాణాధారం. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రంగానికి ఇవ్వాల్సినంత ప్రాధాన్యత ఇవ్వలేదనే చెప్పవచ్చు. 10 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. పంటల సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల లభ్యత, సరఫరా వంటి అంశాలపై లోతుగా చర్చించాల్సి ఉంది. టిడిపి ఎంఎల్‌సి రామగోపాల్‌రెడ్డి, ఎంఎల్‌సి రవీంద్రనాథరెడ్డి పంటల బీమా, ఆశా వర్కర్ల భారిన పడిన పండ్లతోటల నష్టపరిహారం విషయంలో వాగ్వాదం మినహా ఎటువంటి లోతైన చర్చను చేపట్టకపోవడం విస్మయాన్ని కలిగించింది. ఎమ్మెల్సీ స్పందించి ఆదివారం సాయంత్రం కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి దెబ్బతిన్న పండ్ల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, నష్టానికి పరిహారాన్ని అందించాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వితరణ వెంటనే నష్టం వాటిల్లితే 25 శాతం పరిహారం లభించే అవకాశం ఉందని, వైఎస్ఆర్ పంటల బీమా పథకం అమలుతో అటువంటి అవకాశాన్ని కోల్పోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉత్తీర్ణతశాతం అధ్వానంగా ఉండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. నాడు-నేడు పథకం గురించి గొప్పలు చెబుతున్నారని, పులివెందులకు చెందిన పాఠశాలలో మూడు దశల నాడు-నేడు మౌలిక వసతులు కల్పించడం లేదే దొంగతనం వెల్లడవుతోందని విమర్శించారు. దీనికి ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ జోక్యం చేసుకుని ఎమ్మెల్సీ సూచించిన సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తామని హామీనిచ్చారు. బి.మఠంలోని ఎస్‌సి కాలనీకి ఎల్‌ఎన్‌పి దగ్గర ఏర్పాటు చేయడం ద్వారా 40 మంది విద్యార్థులకు భారంగా మారిందని, జూనియర్ కళాశాలను మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని బి.మఠం జెడ్‌పిటిసి వివరించారు. దీనికి కలెక్టర్ విజయ్‌రామరాజు స్పందించి గతంలో ఇద్దరు పిల్లలు మృతి చెందడంతో మార్చాల్సి వచ్చిందని, ఇటువంటి ఘటనలు పునరావృతం గాకుండా చూస్తామని హామీనిస్తే పునరుద్ధరించే ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం అసైన్‌మెంట్ కమిటీల్లో అర్హులకు తగిన స్థానం దక్కలేదని, 419 మంది అర్హుల పేర్లను పరిశీలించాలని చక్రాయపేట జెడ్‌పిటిసి సభ దృష్టికి తీసుకొచ్చారు. బి.మఠం ఎంపిపి, జెడ్‌పిటిసిలు స్పందించి తమ మండలంలోనూ ఇటువంటి ఘటనలు పెచ్చుమీరాయని, అసైన్‌మెంట్ కమిటీని రద్దు చేయాలని, టిడిపి హయాంలో ఒక్కో ఇంట్లో పిల్లల పేర్లతో కలిపి 20 ఎకరాలను ఇచ్చారని, ఇటువంటి వాటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి స్పందించి తమ అసెంబ్లీ పరిధిలో వీరపునాయునిపల్లి మండలంలోనూ ఇటువంటి అక్రమాలు జరుగుతున్నాయని సభ దృష్టికి తెచ్చారు. దీనికి కలెక్టర్ జోక్యం చేసుకుని బి.మఠం, వీరపునాయునిపల్లి మండలాల నుంచే ఎక్కువగా భూ ఆక్రమణలపై ఫిర్యాదులు వస్తున్నాయని, భూసమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్‌ను ఏర్పాటు చేసి పరిష్కరించే ప్రయత్నం చేస్తామని, దీంతోపాటు నియోజకవర్గ కేంద్రాల్లో కార్యక్రమాల్ని ఏర్పాటు చేసి సుమారు 28 వేల చుక్కల భూముల అర్హత పత్రాలను అందజేస్తామని హామీనిచ్చారు. ఆర్‌బికె సెంటర్లలో సోషల్ ఆడిట్‌కు ఉంచుతామని తెలిపారు. దీనిపైన ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ స్పందించి అసైన్‌మెంట్ కమిటీలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. భూమి మీద ఉన్న వారికే యాజమాన్య హక్కులు వస్తాయని చెప్పారు. భూముల సాగుకు సంబంధించిన పైపులు, పంపులు, పట్టల కాంట్రాక్టును జిల్లాలోని ఆరు కంపెనీలను కాదని, ఒక్క గద్దకు చెందిన ఓకే సంస్థ నాసిరకమైన కంపెనీ అని, కాంట్రాక్టును రద్దు చేసి నాణ్యమైన కంపెనీకి ఇవ్వాలని వివిసిపల్లి జడ్‌పిటిసి డిమాండ్ చేశారు. దీనికి డ్వామా పీడీ స్పందించి నాణ్యమైన ఉత్పత్తులను అందించే ఏర్పాట్లు చేస్తామని హామీనిచ్చారు. అనంతరం కలెక్టర్ జోక్యం చేసుకుని జిల్లా ఆడిట్ టీమ్ ద్వారా నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీపడకుండా చూడాలని ఆదేశించడం గమనార్హం.

సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

'కేతు' మరణం సాహితీ లోకానికి తీరని లోటు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రముఖ కథా రచయిత రాయలసీమ కథారత్న ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సోమవారం తెల్లవారు జామున 5.30 గంటలకు ఒంగోలులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో గుండ పోటుతో హఠాన్మరణం చెందారు. తెలుగు సాహిత్యంలో కథకునిగా, విద్యావేత్తగా, పరిశోధకునిగా నిరంతర సృజనశీలిగా సుప్రసిద్ధులైన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి 1939, జులై 10న కడప జిల్లా, కమలాపురం తాలూకా, రంగసాయిపురంలో కేతు వెంకటరెడ్డి, నాగమ్మ దంపతులకు జన్మించారు. జి.ఎన్.రెడ్డి. పర్యవేక్షణలో కడప జిల్లా గ్రామ నామాలు అనే అంశం మీద పరిధోధన చేసి డాక్టరేట్ పొందారు. ఆయన మొదటి నుంచి తన చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా పరిశీలించి శాస్త్రీయ దృక్పథంతో మానవ సంబంధాలను విశ్లేషించి రచనలు చేశారు. విశ్వనాథరెడ్డి జిల్లా, గ్రామ నామాలపై లోతైన పరిశోధన చేసి విశిష్టమైన పంథాలో పరిశోధన చేశారు. గ్రామ నామాలను, ఆ గ్రామాల జీవిన విధానాన్ని, ఆచార వ్యవహారాలను, ఆర్థిక అసమానతలను పరిశీలించి వెలువరించిన అధ్యయన ఫలితాలు ప్రశంసనీయం, ఈ పరిశోధన తరువాత తరాలవారికి మార్గదర్శకమైన అనేక నిఘంటువుల రూపకల్పనకు దారితీసింది. ఆయన హఠాన్మరణం జిల్లాలోని సాహితీ లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మృతి సందర్భంగా పలువురు సంతాపం తెలిపారు. కేతు విశ్వనాథ్‌రెడ్డి మృతి పట్ల సి.పి.బ్రౌన్ భాష పరిశోధన కేంద్రం సంచాలకులు మూల మల్లికార్జునరెడ్డి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. కురువృద్ధులు, రాయలసీమ కథకు చిరునామా కేతు విశ్వనాథరెడ్డి మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటని సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ బండి లెనిన్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమారస్వామి అన్నారు. కేతు సాహితీలోకానికి తీరని లోటని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాల రూపకల్పనలో ఎస్‌సిఇఆర్‌టి సంపాదకుడుగా వ్యవహరించారని తెలిపారు. కేతు మరణం బాధాకరమని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. వారి కుటుంబం సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రామిక జనపక్షపాతి కేతు మరణం బాధకరమని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు.

గత ఏడాది జూన్ 18న కడపలో నిర్వహించిన ఎంహెచ్ అవార్డు ప్రదానోత్సవంలో కేతు విశ్వనాథరెడ్డిని సన్మానిస్తున్న ప్రజాశక్తి సిబ్బంది (ఫైల్‌ఫొటో)

నేడు కడపకు 'కేతు' పార్థివదేహం

కేతు విశ్వనాథరెడ్డి పార్థివదేహం ఒంగోలులోని కూతురు ఇంటి నుంచి మంగళవారం మధ్యాహ్నం కడపకు తీసుకువస్తారు. సింగపూర్ టౌన్‌షిప్‌లోని ఆయన సొంత ఇల్లు 'అపేక్ష' వద్ద అభిమానుల సందర్శన కోసం ఉంచుతారు. ఆమెరికాలో ఉన్న ఆయన కుమారుడు, కుమార్తెలు మంగళవారం అక్కడి నుంచి బయలుదేరి బుధవారం కడప చేరుకుంటారు. అదేరోజు కేతు సొంతూరు రంగసాయిపురం (ఎర్రగుంట్ల మండలం) తీసుకుపోతారు. మధ్యాహ్నం లేదా సాయంత్రం దహన సంస్కారాలు ఉంటాయని కుటుంబ సభ్యులు వెల్లడించారు. కేతు సతీమణి పద్మావతమ్మ ఆదివారం ఒంగోలు సంఘమిత్ర ఆసుపత్రిలో గుండెకు సంబంధించిన పరీక్షలు కొనసాగుతున్నాయి. కూతురు అమ్మవద్దే ఉంది. కేతు, ఆయన అల్లుడు ఆదివారం రాత్రి ఇంటిలోనే ఉన్నారు. సోమవారం తెల్లవారు జాములన కేతు అల్లుడిని లేపి ఊపిరాడడం కష్టంగా ఉందని చెప్పారు. వెంటనే ఆయనను ఆదే సంఘంమిత్ర ఆసుపత్రికి తీసుకువెళ్లారు. డాక్టర్లు కేతును వెంటిలేటర్ మీదకు చేర్చే సరికే ఆ సాహితీ వటవృక్షం వేలాడిపోయింది. ఆదే ఆసుపత్రిలో గుండె పరీక్షలు చేసుకుంటున్న పద్మావతమ్మకి తెలిస్తే ఆమెకేమవుతుందోనని ఇంత వరకు భర్త మరణ వార్తను తెలియకుండా దాచాల్సి రావడం ఇంకో విషాదం.

కార్మిక ఉద్యమ నిర్మాత 'పర్సా' : 'సిటు'

సత్యనారాయణ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కార్మిక ఉద్యమ నిర్మాత పర్సా సత్యనారాయణ అని పలువురు నాయకులు అన్నారు. సోమవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో పర్సా 8వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సిఐటియు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ సిఐటియు ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులుగా 1970 నుంచి 2022 ఉన్నారని తెలిపారు. సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహించారని చెప్పారు. 1924, జూన్ 2న జన్మించారని పేర్కొన్నారు. 19 సంవత్సరాల వయసులోనే నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని తెలిపారు. కార్మికుల జీవితాలలో వెలుగు నింపడానికి ఉద్యమాలను ఆయుధంగా చేసుకున్నారని చెప్పారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశంఖం పూరించడానికి ఆయన ఆధ్యుడిగా నిలిచారని పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ స్థాపించి కార్మికుల జీవితాల్లో మార్పు కోసం అనేక పోరాటాలు యూనియన్ ద్వారా నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులురెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామమోహన్, నగర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య, మున్సిపల్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి వై.ఎం.కేశవులు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటేష్, రిమ్స్ పవన్, ఉదయ్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి పరూక్ హుస్సేన్, నరేష్, మల్లి, శికామణి, శివాజీ, చంద్ర పాల్గొన్నారు.

హౌసింగ్ లక్ష్యాన్ని అధిగమించాలి : కలెక్టర్

కడప: జిల్లాలో నిర్ణీత లక్ష్యం మేరకు జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ విజయ్‌రామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో జెసి జి.గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనాలతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతిపై నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదలకు ఇళ్ళు పథకంలో భాగంగా చేపడుతున్న గృహ నిర్మాణ పనులను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతివారం ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. లే అవుట్ పూర్తయినవి, పూర్తి కానివీ, గ్రౌండింగ్ మొదలు కానివీ, మెటీరియల్, రుణ సహకారం మొదలైన అన్ని రకాల సదుపాయాలను సమకూర్చి గృహనిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్డిఓలు ధర్మ చంద్రారెడ్డి, వెంకట రమణ, వెంకటేష్, శ్రీనివాసులు, వివిధ శాఖలకు చెందిన నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు : ఆర్ఐఒ

కడప అర్బన్: ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఈ నెల 24 నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఐఒ రమణరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాల్లో 62 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 24 నుంచి జూన్ ఒకటి వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఉదయం 9 నుంచి 12 వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాలోకి అనుమతించరని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం 16,486 మంది, ద్వితీయ సంవత్సరం 10,200 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉందని పేర్కొన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో హై పవర్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. 3 ఫ్లయింగ్, 10 మంది సిట్టింగ్ స్క్వాడ్స్, 15 మంది సెంటర్ కస్టోడియన్లను నియమించామని పేర్కొన్నారు. వివరాలకు కంట్రోల్ రూం నంబరు 08562-244171 నంబరు సంప్రదించాలని తెలిపారు. సెల్ ఫోన్లు, యూట్యూబ్ ద్వారా వచ్చే ఎలాంటి పుకార్లను నమ్మవద్దని పేర్కొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో అడ్మిషన్ల కోసం హెల్ప్‌డెస్క్

కడప: ప్రభుత్వ పురుషుల కళాశాలలో బిఎ, బికాం, బిఎస్‌సి కోర్సులలోచేరే విద్యార్థులకు అవసరమైన అవగాహన కల్పించుటకై హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్.జి.రవీంద్రనాథ్ తెలిపారు. కళాశాలలో చేరదలచిన విద్యార్థులు ఈ హెల్ప్ డెస్క్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకొని కళాశాలలో అడ్మిషన్లను పొందవచ్చని పేర్కొన్నారు. కళాశాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడానికి అవసరమైన అన్ని కోర్సులు కళాశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థి సర్వముఖాభివృద్ధికి అవసరమైన వ్యాయామశాల, ఆటస్థలం, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటివి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ద్వారా విద్యార్థులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రతి సంవత్సరం ఎంపిక అవుతున్నారని తెలిపారు. దీనికి అవసరమైన లైబ్రరీ, శిక్షణ కళాశాలలో అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : డిఆర్ఒ

కడప: ప్రజా సమస్యల పరిష్కారార్థం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను డిఆర్ఒ గంగాధర్‌గౌడ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. డిఆర్ఒతో పాటు అనుడ సెక్రటరీ శ్రీలక్ష్మి హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు పారదర్శకంగా విచారణ చేసి, నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు

మోసపూరిత యాప్‌ల నుంచి కాపాడండి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజలను ఆన్‌లైన్ మోసపూరిత యాప్‌ల నుంచి కాపాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కోరారు. సోమవారం పోలీస్ కార్యాలయ స్పందనలో అదనపు ఎస్‌పి తుషార డూడికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు జివి ఫుట్బాల్, మూన్ ఫుట్బాల్ లాంటి ఎన్నో ఆన్‌లైన్ మోసపూరిత యాప్‌లను ప్రవేశపెట్టి మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ నేరగాళ్ల నుంచి ప్రజలను మరింత అప్రమత్తం చేసి కాపాడాలని కోరారు.

ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని జిల్లా కన్వీనర్/ప్రిన్సిపల్ ఎం.జ్ఞానకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవతరగతి, ఇంటర్మీడియట్ పాస్, ఫెయిలై, 40 సంవత్సరాల గరిష్ట వయసు ఉన్న స్త్రీ, పురుష అభ్యర్థులు అడ్మిషన్ పొందుటకు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు అడ్మిషన్లు పొందుటకు ఆన్‌లైన్ ద్వారా ఐటిఐ.ఎపి.జిఒవి.ఐఎన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తికలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఫొటో, మెయిల్ ఐడి, ఫోన్ నంబరు తీసుకుని దగ్గరలో ఉన్న ఏ ప్రభుత్వ ఐటిఐలో అయినా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. జూన్ 6వ తేదీలోపు వివరాలను తప్పక పరిశీలన చేయించుకోవాలని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ చేయించుకుని సాంకేతిక విద్యను అభ్యసించాలని పేర్కొన్నారు.

సభ్యుల పట్ల పక్షపాతం తగదు

ప్రజాశక్తి - కడప అర్బన్

సంఘ సభ్యుల పట్ల పట్టణ సమాఖ్య, స్లమ్ సమాఖ్య ఆర్‌పిలు అధికారం చెలాయించడం, పక్షపాతం చూపడం తగదని జిల్లా మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖరరావు అన్నారు. సోమవారం నిహార్ స్కిల్ అకాడమిలో 2వ విడత ఆర్‌పిలకు శిక్షణ తరగతుల ముగింపు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యుల పట్ల మార్యదపూర్వకంగా, ఆర్థిక లావాదేవీలు క్రమశిక్షణగా ఉండాలని తెలిపారు. సంఘానికి మంచి పేరుతీసుకురావాని పేర్కొన్నారు. సంఘం పుస్తకాల్లో ఎలాంటి దిద్దుబాట్లు ఉండకూడదని చెప్పారు. కార్యక్రమంలో ఐబి ఎఫ్రాయిమ్, సంస్థ ప్రతినిధులు గోపినాథ్, నాగరాజు, జోసఫ్, శోభ పాల్గొన్నారు.

విజయవంతంగా కెజిపిజి సెట్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎంబిఎ, ఎంసిఎ కోర్సులలో 2023-24 విద్యా సంవత్సరానికి చేరబోయే ఆశావాహులకు నిర్వహించిన మాక్ కెజిపిజి సెట్ 2కె23 విజయవంతమైందని కెఎస్ఆర్ఎం కళాశాల మేనేజ్‌మెంట్ ఆఫ్ స్టడీస్ ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ పరీక్షకు కడప, చిత్తూరు జిల్లాల నుంచి బిఎ, బికాం, బిఎస్‌సి, బిబిఎ, బిటెక్, బీ ఫార్మసీ విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. కెఎస్ఆర్ఎం విద్యాసంస్థల ఎండి డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి కళాశాల సిబ్బందిని అభినందించారు.

విజయవంతంపై హర్షం వ్యక్తం చేస్తున్న కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

కాశినాయన: మండల పరిధిలోని ఎపి మోడల్ పాఠశాలలో 2023-2024 ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సౌజన్య తెలిపారు ఎంపిసి, బైపిసి, ఎంఇసి గ్రూపులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన నకలను పాఠశాలలో ఇవ్వాలని తెలిపారు. ఒసి, బిసి, ఒబిసి విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 రుసుం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది పదవ తరగతి పాసైన వారు అర్హులన్నారు. 10వ తరగతి పరీక్షల్లో వచ్చిన మార్పుల ప్రతిభ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు. ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ వసతి అక్కడే కలదని పేర్కొన్నారు. పేద ప్రజలకు ఇది గొప్ప అవకాశం అని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రాథమిక చికిత్సపై శిక్షణ

కడప అర్బన్: వైఎస్ఆర్ క్లినిక్స్‌లో సేవలందిస్తున్న సిహెచ్‌ఒలకు ప్రాథమిక చికిత్సపై శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఇన్‌ఛార్జీ ఆర్‌డి డాక్టర్ అనిల్‌కుమార్ ప్రారంభించారు. 6 రోజులు నిర్వహించే శిక్షణకు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.హిమగిరి కుమార్ అధ్యక్షత వహించారు. శిక్షణలో పాము కాటు, పురుగు కుట్టిన, తేలు కుట్టిన, ఏదైనా గాయమైనా, ఇరత ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన ప్రథమ చికిత్స ఆత్యవసర చికిత్స అందించి అవసరమయిన వారికి తగిన సూచనలు, వసతులు కలిగిన ఆసుపత్రులకు రెఫెర్ చేయుట శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఉమా మహేశ్వర కుమార్, ఇన్‌ఛార్జి డిపిఎంఓ డాక్టర్ లక్ష్మీకర్, ఎప్డమాలజిస్ట్ ఖాజా మొహిద్దీన్, కుమారి, పాలేస్వర్, పిసిపి, ఎన్‌డిటి కన్సల్టెంట్ హాజరయ్యారు.

స్పందన ఫిర్యాదులు పరిష్కరించాలి : ఎస్‌పి

కడప అర్బన్: జిల్లాలో బాధితులు స్పందన ద్వారా పోలీస్‌శాఖకు ఇచ్చే ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఎస్‌పి అన్బురాజన్ ఆదేశించారు. సోమవారం డిపిఒలో స్పందన ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలని తెలిపారు. బాధితులకు న్యాయం చేయాలని చెప్పారు.

కడపలో కార్ జోన్ ప్రారంభం

కడప: కడప నగరంలోని అల్మాస్‌పేటలో రహీం, సత్తార్ ఆధ్వర్యంలో కడప కారు జోన్‌ను వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, నాయకులు ఎస్.బి.అహ్మద్‌బాషా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని హంగులతో కూడిన కడప కారు జోన్‌ను కడప నగరంలో ఏర్పాటు చేయడం శుభపరిణామని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటు ధరలలో అందించి వారి మన్ననలు పొందాలని సూచించారు. యజమానులు రహీమ్, సత్తార్‌లకు శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చాక్లెట్ గౌస్, అలీ అక్బర్, షఫీ, హరూన్ బాబు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కార్ జోన్ ప్రారంభిస్తున్న అఫ్జల్ ఖాన్, అహ్మద్‌బాషా

డిఆర్‌కు వినతి పత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

అధ్యాపకులపై ఒత్తిడి ఆపాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రస్తుతం ప్రైవేటు విద్యా సంస్థలు తమ విద్యా సంస్థలలో విద్యార్థులు చేర్చుకోవడానికి ప్రచారం తిరగడానికి, ప్రతి ఒక్కరికీ టార్గెట్లు పేరుతో అడ్మిషన్లు చేర్పించాలని ప్రైవేటు అధ్యాపకులను ఒత్తిడి చేయడాన్ని విరమించుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల.శివకుమార్ తెలిపారు. సోమవారం కలెక్టర్ స్పందనలో డిఆర్‌ఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో తీవ్ర స్థాయిలో ఎండలు మండుతున్నాయి అన్నారు. ఈ సమయంలో బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్న క్షణంలో ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యాసంస్థలు ప్రచారం కోసం ఊరూరూ, వీధి, వీధులు తిప్పుతూ ప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు. రాకుంటే తర్వాత విద్యా సంవత్సరం తిరిగి తీసుకోమని బెదిరిస్తున్నారని చెప్పారు. బలవంతంగా ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. దీనిని యువజన సంఘం గా ఖండిస్తున్నామన్నారు. ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ, ప్రచార ఆర్బాటాలు యాజమాన్యాలు నిర్వహిస్తున్న జిల్లాలో విద్యా శాఖా అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారని విమర్శించారు. వారికి పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం వారికి కనీస వేతన సౌకర్యం కల్పించి ఉద్యోగ భద్రత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటి అమలు కోసం భవిష్యత్ లో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయుల పై ఒత్తిడి, బలవంతపు ప్రచారాలను ఆపాలన్నారు. అలా నిర్వహిస్తున్న యాజమాన్యాల పై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్థానిక ఓ కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళన ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, మొదట గురువులను గౌరవించి వారికి పూలమాలలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఉపాధ్యాయులు సిద్దయ్య మాట్లాడుతూ, విద్యార్థులు ఎంత ఉన్నత స్థాయిలో ఉన్న గురువుల పట్ల చూపించే, గౌరవం ,ప్రేమ, అపారమైనదని అన్నారు. వినయ విధేయతలతో ఉన్నవారు ఎప్పటికైనా ఉన్నత స్థాయిలో ఉంటారని వారు తెలిపారు. ప్రస్తుతం ఉన్న మన సమాజంలో మీ పిల్లలను, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం అడుగుజాడల్లో, నడిపించాలని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఎఎన్ఎం, అరుణకుమారి, రసూల్, నజీర్, వెంకటేశ్వర్లు, చిన్న, నాగేంద్ర పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్‌పి అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీసులు సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని సిఐ మంజునాథరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చలివేంద్రం ఏర్పాటుకు సహకరించిన ఐసిఎల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణయ్య, ఎఎస్ఐ రాజారెడ్డి, పోలీస్ సిబ్బంది, ఐసిఎల్ సెక్యూరిటీ అధికారి రావు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐ మంజునాథరెడ్డి

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రాబోవుతునట్లు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. స్థానిక సంఘం వీధిలో వైసిపికి చెందిన 10 కుటుంబాలు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వేమ య్య, బాలం సుబ్బరాయుడు, లోకేష్‌తోపాటు పలువురికి తులసిరెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేలూరు శ్రీనివాసులురెడ్డి కాంగ్రెస్ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ వైసిపి నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పలువురు యువకులు రావడం సంతోషకరమన్నారు. దేశం, రాష్ట్ర అభివృద్ధికి వైసిపిలో ఉన్న నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయసాధన కోసం కలిసికట్టుగా పని చేస్తామని తెలిపారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి చేరితే స్వాగతిస్తామని అన్నారు. కాంగ్రెసు పార్టీలో చేరే కార్యకర్తలకు సముచిత గౌరవం, స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కర్ణాటకలో కాంగ్రెస్ రావడం ఎపి ప్రజలు స్వాగతించారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, నరసింహరెడ్డి, శివ, నాగార్జున, చెన్నకేశవ, వేమయ్య, లోకేష్, మణికంఠ, వినయ్, శ్యాం, బద్రి, శివ, రవితోపాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న తులసిరెడ్డి

వైసిపిలో మైనార్టీలకు సముచిత స్థానం

- మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ అబ్దుల్

ప్రజాశక్తి - వేంపల్లె

ముస్లిం మైనార్టీలకు సముచిత స్థానం కల్పించిన ఏకైక పార్టీ వైసిపి అని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ ముజీబ్ చెప్పారు. మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వైఎస్ఆర్ సమాధిని సోమవారం ఆయన సందర్శించారు. ముందుగా వేంపల్లెలోని హనుమాన్ జంక్షన్‌లో వైసిపి సేవాదళ్ అధ్యక్షుడు రఫి ఆధ్వర్యంలో అబ్దుల్ ముజీబ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అబ్దుల్ ముజీబ్ మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలను సిఎం జగన్ గుర్తించి పదవులను కట్టబెట్టారన్నారు. సిఎం జగన్ వల్లే తనకు ఇంత గౌరవం దక్కిందని ఆయన తెలిపారు. ముస్లిం మైనార్టీ ప్రజల సంక్షేమం కోసం పని చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి మైనార్టీ కార్యకర్తలు గౌస్‌పీర్, ఫిరోజ్, అమీర్ బాషా, ఇస్మాయిల్, అసిన్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

రాయితీతో వేరుశనగ కాయలు

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలో మంగళవారం నుండి 2023 ఖరీఫ్‌నకు సంబంధించి రైతులకు సబ్సిడీపై కె6 రకం వేరుశనగ కాయలు 40 శాతం రాయితీతో పంపిణీ చేయనున్నట్లు ఎఒ పి.అరుణకుమారి తెలిపారు. ఒక రైతుకు అర ఎకరం భూమికి 30కిలోలు గల ఒక బ్యాగు, ఎకరం భూమికి రెండు బ్యాగులు, ఎకరానికి పైగా ఉన్న భూమికి మూడు బ్యాగులు వేరుశనగ కాయలు పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. వేరుశనగ కాయలు వాస్తవ ధర ఒక బ్యాగు రూ.2,790కాగా రాయితీతో రూ.1,674 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెండు బ్యాగులకు రూ.3,348, మూడు బ్యాగులకు రూ.5,022 చెల్లించవలసి ఉంటుందని ఎఒ వివరించారు. అవసరమైన రైతులు సచివాలయ పరిధిలోని ఆర్‌బికెలో సంప్రదించాలన్నారు.

లింగాల : మండలానికి 500 క్వింటాళ్ల వేరుశనగ కాయలు మంజూరైనట్లు ఎఒ రమేష్ తెలిపారు. 40శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వేరుశనక్కాయలు కావాల్సిన రైతులు తమ దగ్గరలోని రైతు భరోసా కేంద్రం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని ఉపాధ్యాయులు సిద్దయ్య తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిబిరాల్లో భాగంగా సోమవారం అందాల ఆవశ్యకత గురించి ఆయన వివరించారు. ప్రతి విద్యార్థి ఏదోక సమయంలో ప్రతిరోజు గ్రంథాలయాలకు వెళ్లి అక్కడ ఉన్న ఎన్నో పుస్తకాలు చదవాలన్నారు. తద్వారా చాలా విషయాలు తెలుసుకోవచ్చునని సూచించారు. రాబోయే రోజుల్లో ఆ విజ్ఞానం మీకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, లైబ్రేరియన్ కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

25న గురివిరెడ్డి ప్రథమ వర్ధంతి సభ

పజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ఈ నెల 25న జరిగే సిపిఎం మాజీ మండల కార్యదర్శి కామ్రేడ్ యత్తపు గురివిరెడ్డి ప్రథమ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి సాన గోవింద్ కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమాన్ని సుందరయ్య కాలనీ దగ్గర ఏర్పాటు చేశామన్నారు. సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీనియర్ నాయకులు బి.నారాయణ, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జి.శివకుమార్, హాజరు కానున్నారని తెలిపారు. మండలంలో సిపిఎం నిర్వహించిన అనేకప్రజాపోరాటాల్లో గురివిరెడ్డి తనదైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గండి గుర్రయ్య, అజయ్‌కుమార్, భాస్కర్, లక్ష్మి నారాయణ, రమణ, గురయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు విజయమ్మ పరామర్శ

ప్రజాశక్తి - కలసపాడు

మండలంలోని తెల్లపాడు గ్రామంలో ఆదివారం పిడుగుపాటుకు పడి మృతి చెందిన కాకర్ల గురప్ప కుటుంబాన్ని, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అదే గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త మాలపాటి నరసింహులు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పరామర్శించారు. తెల్లపాడు గ్రామానికి వెళ్లి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎల్లప్పుడు తాము తోడుగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రంతు, టిడిపి మండల ఇన్‌ఛార్జి వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

స్థానిక ఇందిరానగర్ సమీపాన సాయిబాబా నగర్ యా నాది కాలనీలోని ప్రభుత్వ స్కూల్ వెనక వైపున పాత గుణాది సిమెంట్ దిమ్మెల్లో గుర్తు తెలియని పురుషుని మృతదేహం లభ్యమైందని ఎస్ఐ అరుణ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుడు వెంకట సుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు విచారిస్తున్నట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు 91211 00526, 91211 00525 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి కోరారు.

వేసవిలో పశువుల రక్షణ ఇలా..!

ప్రజాశక్తి - జమ్మలమడుగు

వేసవిలో పశువులకు వడదెబ్బ తగిలితే ప్రమాదం ఉంది. వడదెబ్బ వల్ల పాల దిగుబడి తగ్గి, పశువులు ఎదకు వచ్చే పరిస్థితులు కనిపించవని జమ్మలమడుగు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వేసవిలో పశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. పశువుల్లో సోకే వ్యాధులపై ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. వేసవిలో గేదెలు, ఆవులు పట్ల సరైన శ్రద్ధ తీసుకోకపోతే వడదెబ్బకు గురై ఒక్కసారి పశువుల ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంది.

ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రతలు

పశువులకు వడదెబ్బ తగలకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పశువుల పాక చుట్టూ పాత గోనెలు కట్టి, వాటిని అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. పైకప్పును కొబ్బరి ఆకులు, ఎండిన వరిగడ్డితోగాని కప్పాలి. మంచినీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలి. పశువులను చల్లని వాతావరణంలో అంటే ఉదయం, సాయంత్రం మాత్రమే మేతకు తీసుకెళ్లాలి. పశువులు ఎక్కువగా ఎండలో తిరక్కుండా చూడాలి. వీలైనంత పచ్చని మేతనే ఇచ్చేలా చూసుకోవాలి. సంకరజాతి హెచ్‌ఎఫ్, నర్సిలాంటి ఆవులైతే పశువుల కొట్టంలో పంకా (ఫ్యాన్)లు ఏర్పాటు చేయాలి.

వడదెబ్బ తగిలిన పశువుల లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల లక్షణాలను పరిశీలిస్తే శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది. పశువులు నడిచేటప్పుడు తూలుతూ ఉంటాయి. శ్వాసక్రియ ఎక్కువగా ఉంటుంది. పశువులు చాలా నీరసంగా కనబడుతాయి. ఒక్కోసారి కిందపడి కొట్టుకుని స్పృహ కోల్పోతాయి. పశువు నీట కోసం చూస్తూ ఉంటుంది. పశువు చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది. పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది.

గేదెకు చికిత్స అందించాలి

వడదెబ్బ తగిలిన పశువులను రైతులు గుర్తించి వెంటనే చల్లని నీటితో ముఖాన్ని కడగాలి. గుడ్డతో చుట్టూ పశువు నుదుటిపై నొక్కాలి. కొద్దిగా ఊరట కలిగిన తర్వాత దగ్గరలోని పశువైద్యుడ్ని సంప్రదించాలి. సెలైన్ పెట్టించాలి. ఒక్కోసారి వడదెబ్బ తగిలిన పశువు బతికినంత కాలం పాల దిగుబడి గతంలోలాగా ఉండదు.

- డాక్టర్ ఆర్.శ్రీధర్‌రెడ్డి, పశువైద్యులు

ఆధునిక సమాజానికి ఆద్యుడు రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆధునిక సమాజానికి ఆద్యుడు రాజారామ్మోహన్‌రాయ్ అని పుట్టపర్తి సాహితీపీఠం కార్యదర్శి, రచయిత జింకా సుబ్రహ్మణ్యం తెలిపారు. జనవిజ్ఞానవేదిక (జెవివి) ఆధ్వర్యంలో సోమవారం రాజారామ్మోహన్‌రాయ్ జయంతి కార్యక్రమాన్ని జెవివి ప్రధాన కార్యదర్శి సునీత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజా రాజారామ్మోహన్‌రాయ్ బహు భాషాకోవిధుడని, స్త్రీ విద్య, వితంతు వివాహాలను ప్రోత్సహించారన్నారు. బాల్య వివాహాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా సంఘసంస్కరణ గావించారన్నారు. ఆంగ్ల విద్యను ప్రోత్సహించారన్నారు. బ్రహ్మసమాజాన్ని స్థాపించి ఏకేశ్వరోపాసనను ప్రజలకు బోధించారన్నారు. 'మంచి చేయండి-మంచిగా ఉండండి' అని ప్రజలకు హితబోధగావించారని కొనియాడారు. రాజారామ్ మోమన్‌రాయ్ మరణానంతరం ఇంగ్లండ్‌లో ఒక వీధికి ఆయన పేరు పెట్టారన్నారు. ఆయన విగ్రహాన్ని కూడా అక్కడ స్థాపించారన్నారు. అంతకుముందు రాజారామ్మోహన్‌రాయ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, సమన్వయకర్తలు జాహ్నవి, ఆక్షయ, హాసిని, యోచిత, జావెద్, అద్నాన్, నిఖిల్, తేజేష్, చరణ్, హర్ష విద్యార్థులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న జింకా సుబ్రమణ్యం, తవ్వా సురేష్, సునీత, విద్యార్థులు

సమావేశంలో కౌన్సిలర్ల ఆవేదన

సభ దృష్టికి పలు అంశాలు తెచ్చిన మునిసుబ్బారెడ్డి, లక్షుమయ్య

ప్రజాశక్తి - జమ్మలమడుగు

గత సమావేశంలో కౌన్సిలర్లు 12 మంది మార్కెట్ టెండర్ల వేలానికి వ్యతిరేకంగా తీర్మానించామని, అయినా పాతవారినే కొనసాగించడాన్ని వ్యతిరేకిస్తూ జమ్మలమడుగు 13వ వార్డు కౌన్సిలర్ ముని సుబ్బారెడ్డి కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించారు. సోమవారం ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివమ్మ మాట్లాడుతూ కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఉన్న సమస్యలను సభ దృష్టికి తేవాలన్నారు. స్పందించిన కౌన్సిలర్ ముని సుబ్బారెడ్డి మాట్లాడుతూ కౌన్సిలర్లు అందరికీ తెలియజేయకుండా కౌన్సిల్ సమావేశం నిర్వహించినట్లు సంతకాలు పెట్టించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికార పార్టీ కౌన్సిలర్లమైన తమకు తెలియజేయకుండా సమావేశం జరిగిందని సరైందికాదని ఆవేదన వ్యక్తం చేశారు. కో-ఆప్షన్ సభ్యులు లక్ష్మయ్య మాట్లాడుతూ తమ వార్డులో వీధిలైటు ఏర్పాటుకు తాను సొంతంగా రూ.3వేలు ఖర్చు చేశానని, అయినా అధికారుల నుండి ఎలాంటి సహకారం లేదని తెలిపారు. ఎన్నికలు ముగిసిన నాటినుంచి 9 వార్డులో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడంలేదన్నారు. కేవలం కౌన్సిల్ సమావేశంలో 9 వార్డులో అభివృద్ధి పనులు చేస్తామని చెప్పడం తప్పితే ఆచరణలో లేదన్నారు. అనంతరం చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ మాట్లాడుతూ 13వ వార్డు కౌన్సిలర్ ముని సుబ్బారెడ్డి ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి, సభ్యులందరూ ఆమోదం మేరకే సంతకాలు చేయడం జరిగిందన్నారు. వీధి దీపాలు వ్యవహారం సభ్యుడు లక్ష్మయ్య తమ దృష్టికి తీసుకురాలేదని తెలిపారు. వీధి దీపాలను వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు ముల్లా జానీ, పోచిరెడ్డి, షామీర్, గౌరీ, నూర్జహాన్, శివ పాల్గొన్నారు.

వేలంలో గండి క్షేత్రానికి రూ.49 లక్షల ఆదాయం

వేలం పాటలు నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

ప్రజాశక్తి - చక్రాయపేట (వేంపల్లె)

గండి క్షేత్రంలో వేసిన వేలం పాటల ద్వారా శ్రీవీరాంజనేయస్వామి ఆలయానికి రూ.49 లక్షల 55 వేలు ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి, ఆలయ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. చక్రాయపేట మండలంలోని గండి క్షేత్రంలో పూల విక్రయం, కొబ్బరి చిప్పల సేకరణ, వాహనాల పార్కింగ్ కోసం సోమవారం వేలం పాటలు నిర్వహించారు. ఈ బహిరంగ వేలం పాటలకు సింహాద్రిపురం, వేంపల్లె, చక్రాయపేట మండలాల నుండి కాంట్రాక్టర్లు హాజరయ్యారు. దేవస్థానానికి చెందిన కార్యాలయంలో మూడు టెండర్లు నిర్వహించారు. పూలు విక్రయించుకొనుటకు చక్రాయపేట మండలం విజయకుమార్ రూ.16,05,000కు హెచ్చు పాట పాడి టెండర్ దక్కించుకున్నారు. కొబ్బరి చిప్పలు సేకరణను సింహాద్రిపురానికి చెందిన శివప్రసాద్‌రెడ్డి రూ.15,50,000, వాహనాల పార్కింగ్ రుసుం వసూలుకు వేంపల్లెకు చెందిన కటిక నాగరాజు అనే వ్యక్తి రూ.18 లక్షలకు హెచ్చుపాట పాడి దక్కించుకున్నారు. పోటాపోటీగా జరిగిన ఈ బహిరంగ వేలం పాటలో రూ.49,55,000 లక్షల ఆదాయం ఆలయానికి సమకూరిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి చెప్పారు. 10 రోజుల క్రితం జరిగిన తలనీలాలు పోగు చేసుకొనే (వెంట్రుకలు) వేలం పాట ద్వారా కూడా రూ.1కోటి 10 లక్షలకు ఉరవకొండకు చెందిన శ్రీనివాసులు పాట దక్కించుకున్నారని పేర్కొన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. గండి క్షేత్రానికి మంచి ఆదాయం వస్తున్నట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధికి దేవస్థానం పాలక మండలి సభ్యుల సహకారం కూడా చాలా ఉందన్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, ఆర్‌కె వ్యాలీ ఎస్ఐ రంగారావు, చక్రాయపేట ఎపిజిబి మేనేజర్ అశోక్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్ట నివేదికలను అందజేయాలి : పాడా ఒఎస్‌డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆదివారం సాయంత్రం వీచిన గాలి, భారీ వర్షానికి దెబ్బతిన్న పంటల వివరాలను నివేదిక రూపంలో అందజేయాలని పాడా ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి ఉద్యానశాఖాధికారులను ఆదేశించారు. వేముల, లింగాల, పులివెందుల మండలాల్లో 917 హెక్టార్లలో అరటి పంట నేలకొరిగింది. పులివెందుల మండలంలో 380 రైతులకు 408 ఎకరాల్లో, లింగాల మండలంలో 457 మంది రైతులకు 350 హెక్టార్లలో, వేముల మండలంలో 170 మంది రైతులకు 150 హెక్టార్లలో నష్టం జరిగిందని ఉద్యానవన అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. దెబ్బతిన్న పంటలను సోమవారం అనిల్‌కుమార్‌రెడ్డి పులివెందుల మండలంలోని కొత్తపల్లి, కె.వెలమవారిపల్లి ప్రాంతాల్లో పరిశీలించారు. పంట చేతికి వచ్చే సమయంలో నష్టపోయామని, తమను ఆదుకోవాలని రైతులు అధికారులను కోరారు. అనంతరం పాడా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ రైతులు, గ్రామాల వారీగా నష్టపోయిన వివరాలతోపాటు ఎన్ని ఎకరాల్లో పంట నష్టం ఏమేర జరిగిందో నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి, ఉద్యానశాఖాధికారి రాఘవేంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అరటిపంటను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిరసన తెలుపుతున్న శివనారాయణ

ప్రజాశక్తి - మైలవరం

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ కోరారు. మండలంలోని వేపరాల గ్రామంలో సోమవారం ఎపి చేనేత కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేనేతపై జిఎస్‌టి విధించడం ద్వారా వస్త్ర రంగానికి భారమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు 3 సెంట్ల స్థలం ఇవ్వాలని, ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వం రూ.6 లక్షల ఇవ్వాలన్నారు. ప్రధానంగా ప్రతి చేనేత కార్మికుడికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు సౌకర్యం గతంలో ఇచ్చేవారని తెలిపారు. అర్హులైన 45ఏళ్లు దాటిన చేనేత మహిళలకు ఆసరా, చేయూత పథకాలు అమలు చేయాలని కోరుతున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ బేషరతుగా ముద్రా రుణాలు ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరుతున్నామని, లేకుంటే రాబోవు రోజుల్లో చేనేతల సత్తా చాటుతామన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు శ్రీను, కొండయ్య, ముని, గొరిగే కృష్ణ, లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

చీనీ చెట్ల నరికివేత దుర్మార్గం

కొండాపురం : తాళ్ల పొద్దుటూరు పుల్లయ్య రైతుకు చెందిన 300 చీనీ చెట్లను నరికి వేయడం దుర్మార్గపు చర్య అని మండల టిడిపి కార్యకర్త బి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పుల్లయ్య రైతును ఆర్థికంగా కృంగదీయడానికి దుర్మార్గులు పన్నిన కుట్రలో భాగమే నరికివేతని తెలిపారు. ఇలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

అటవీ పరిరక్షణ అందరి బాధ్యత

ఎర్రగుంట్ల : అటవీ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖరరావు పేర్కొన్నారు. ముద్దనూరు అటవీ శాఖ పరిధిలోని ఎర్రగుంట మండలం చిలంకూరు గ్రామంలో ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా సోమవారం పర్యావరణం, జీవనశైలి గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులను నిషేధించి, క్లాత్ సంచులను వాడాలన్నారు. నీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడాలని, అవసరంలేని వస్తువులను ఎక్కడపడితే అక్కడ వేయరాదని సూచించారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. స్థానికంగా కార్యక్రమానికి వచ్చిన ప్రజల చేత 'నేను సైతం సమాజం కోసం' అంటూ అటవీశాఖ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జెడి రత్నరాజు, ఎఫ్ఒ ఓబులమ్మ, ఎఫ్‌బిఒలు సుబ్బరాయుడు, పద్మనాభయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తొలగించడం దారుణం

ప్రజాశక్తి - వేంపల్లె

రజకుల కోసం పాపాఘ్ని నదిలో ఏర్పాటు చేసిన దోబీఘాట్‌కు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పంచాయతీ, విద్యుత్ అధికారులు తొలగించడం దారుణమని ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, మాజీ తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ బాబు తెలిపారు. దీన్ని నిరసిస్తూ సోమవారం పాపాఘ్ని నదిలో ఉన్న దోబీఘాట్ వద్ద మహేష్ బాబు ఆధ్వర్యంలో రజకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రజకుల కోసం బిసి కార్పొరేషన్ కింద దోబీఘాట్ నిర్మించి మోటర్ బోరు, ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ ఇచ్చారన్నారు. పాపాఘ్ని నదికి నీరు రావడంతో దోబిఘాట్ దెబ్బతిందరిచ వాటికి మరమ్మతులు చేసుకొనేందుకు ఇటీవల పంచాయతీ అధికారుల దృష్టికి సతీష్‌రెడ్డి కూడా తీసుకెళ్లారన్నారు. దోబీఘాట్ ఉపయోగంలో లేదనే కారణంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి పంచాయతీకి చెందిన వాటర్ సరఫరాకు ఏర్పాటు చేయడం సరైందికాదన్నారు. తొలగించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే బిగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

దోబీఘాట్ వద్ద నిరసన తెలుపుతున్న రజకులు

తెలుగు కథ యుగకర్త కేతు విశ్వనాథరెడ్డి

- అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య

ప్రజాశక్తి - చాపాడు

సుప్రసిద్ధ కథా రచయిత, సాహిత్య విమర్శకులు, గొప్ప పరిశోధకులు ఆచార్య కేతు విశ్వనాథ్‌రెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోవడం రెండు తెలుగు రాష్ట్రాల సాహితీ ప్రపంచానికి తీరని లోటని అధికార భాష సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేతు విశ్వనాథరెడ్డి తెలుగు కథ సాహిత్యానికి యుగకర్త అని, బడుగుబలహీన వర్గాల పక్షం వహించి కథా రచన చేపట్టారన్నారు. భూస్వాములకు, నిరుపేదలకు మధ్య జరుగుతున్న సామాజిక సాంఘిక సంఘర్షణను కథలుగా మనకందించారన్నారు. కేవలం కడప జిల్లా, రాయలసీమకు మాత్రమే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలలో కేతు విశిష్ట కథకుడన్నారు. నేటితరం కేతును చూసి ఎన్నో విషయాలు నేర్చుకోవాలన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలకు లోబడి అభ్యుదయ రచయితగా విశేషమైన కృషి చేశారన్నారు. కుల, మత, వర్గ వివక్షతకు వ్యతిరేకంగా కేతు కలం కదిపారన్నారు. నేటి పరిశోధకులకు, కథకులకు, సాహితి విమర్శకులకు ఆచార్య కేతు దిక్సూచి అన్నారు.

వేంపల్లె : కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కేతు విశ్వనాథరెడ్డి మృతి చాలా బాధాకరమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. కేతు విశ్వనాథరెడ్డి గొప్ప కథా రచయితతోపాటు సాహిత్య పరిశోధకుడని పేర్కొన్నారు. వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కార్ అవార్డు కూడా పొందరాన్నారు. పల్లెకవి, రైతుకవి, రాయలసీమ సాహితీ వనంలో తులసి మొక్క అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. అలాగే విలక్షణ నటుడు శరత్‌బాబు మృతికి కూడా తులసిరెడ్డి.. శరత్‌బాబు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

నేడు వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని వాలంటీర్లను మంగళవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి సన్మానించనున్నట్లు ఎంపిపి టి.లక్షుమయ్య తెలిపారు. వీరికి సేవామిత్ర పురస్కారంతో సన్మానించనున్నారు. మండలంలోని ఒకరికి వజ్ర పురస్కారం ద్వారా రూ.30వేలు, 5మందికి రత్నా పురస్కారం ద్వారా రూ.20వేలు, 231 మందికి సేవా మిత్ర పురస్కారం ద్వారా రూ.10వేలు మంజూరవుతుందన్నారు. నగదు వాలంటీర్ల ఖాతాల్లో త్వరలో జమవుతుందన్నారు.ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఎంపిపి కోరారు.

రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ఆర్‌టిసి డిపో నుంచి తేలూరు, సైదాపురం గ్రామాల సమీపంలో ఉన్న బిబిఎస్‌ఆర్ లారీ ట్రాన్స్‌పోర్ట్ గ్యారేజ్ వద్ద రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని బివిఎస్‌ఆర్ ట్రాన్స్‌పోర్టు సుబ్బారెడ్డి, సర్పంచు రామ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం డిఎం ఉమా మహేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందులకు వచ్చే ఆర్‌టిసి బస్సులు పొద్దుటూరు వైపు వెళ్లే ఆర్‌టిసి బస్సులను లారీ గ్యారేజ్ వద్ద ఆపేలా చూడాలని కోరారు. ఇందుకు డిఎం స్పందిస్తూ ప్రయాణికుల సౌకర్యార్థం రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణికుల కోసం పాడా నిధులతో ఒక షెడ్డు ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కులాయప్ప, ఎడిసి జిఎన్ ఆచారి, సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ గోపాల్‌రెడ్డి, ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

డిఎంకు వినతిపత్రం ఇస్తున్న సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి

అనాథాశ్రమానికి సిఐ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని తిప్పలూరు గ్రామంలో ఉన్న ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథాశ్రమానికి స్థానిక సిఐ మంజునాథరెడ్డి, ఎస్ఐ కృష్ణయ్య రూ.20వేలు ఆర్థికసాయాన్ని సోమవారం ఆశ్రమ నిర్వాహకుడు నాగేంద్రకు అందజేశారు. ఆశ్రమ అభివృద్ధికి తమవంతు చిరు సాయంగా ఈ నగదును అందించినట్లు సిఐ తెలిపారు. ఆశ్రమ నిర్వాహకుడు నాగేంద్ర మాట్లాడుతూ ఆర్థిక సాయం అందించిన సిఐ, ఎస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో ప్రజలకు, ప్రయాణికులకు కాలభైరవ న్యాయ పరిరక్షణ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ప్రజలు, ప్రయాణికులు వడదెబ్బ బారిన పడకుండా తమకు చేతనైన సాయం అందిస్తున్నామని కాలభైరవ న్యాయ పరిరక్షణ సేవా సంఘం అధ్యక్షులు రెడ్డయ్య తెలిపారు. కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు రామిరెడ్డి, నాగయ్య, లీలాకృష్ణ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవా సంఘం సభ్యుల

IN THE COURT OF THE HON'BLE IIIrd Addl. JUNIOR CIVIL JUDGE : KADAPA.

O.S.No. 1094/2022

Siddigalla Obulesu, S/o Chinnappa, aged 45 years, Hindu, Pvt Employee, R/o D.No.1/281, Bhagathsingh Nagar, Kadapa City& District.
...Petitioner/Plaintiff

V/s

Syed Eliyas, S/o Late S.Rasool, aged about 38 years, Muslim, Business, R/o E-01-173 & E-01-172, D.No.8/167, Prakash Nagar, Kadapa City & District.
...Respondent/Defendant

నోటీసు/దావా సమను

పై నెంబరు గల కేసులో వాది, ప్రతివాది అయిన నీ మీద సివిల్ దావా దాఖలు చేసియున్నారు.పై దావాలో ప్రతివాది అయిన మీరు 05-07-2023వ తేదీన ఉదయం 10.30గం॥లకు పై కోర్టు నందు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు వున్నచో మనవి చేసుకొనవలెను. లేనియెడల రాజశ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

వాయిదా తేది: 05-07-2023.

//By Order Of the Court//

G.VIJAYAMARUTHI REDDY
K.ANITHA
Advocates, Kadapa.